batukammanews.com
TEL/2019/78873

# బతుకమ్మ

8 నవంబర్ 2026
ఆదివారం

తాజా వార్తల సద్దిమూట

## సంక్రాంతి తర్వాత రాష్ట్రవ్యాప్తంగా

# ప్రజాబలం పర్యటనలు

- కొడంగల్‌కు రూ.9 వేల కోట్లతో అభివృద్ధి పనులు
- కొడంగల్‌ను దేశానికే మోడల్‌గా తీర్చిదిద్దుతాం
- రైతులకు లాభాలు చేకూరేలా ప్రభుత్వం చర్యలు
- ఆరుతడి పంటల వైపు రైతులు దృష్టి సారించాలి

2

సీఎం రేవంత్‌రెడ్డి



సంక్రాంతి తర్వాత 'ప్రజాబలం' పేరుతో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. దుద్యాల మండలం హకీమ్‌పేటలో శనివారం నిర్వహించిన రైతుమేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రజలంతా ఐక్యంగా ఉంటే అన్నింటినీ జయించవచ్చన్నారు. రైతులకు లాభాలు చేకూరేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాజెక్టులు పూర్తికాలేదని విమర్శించారు. ప్రాజెక్టులు పూర్తయి ఉంటే పాలమూరు, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో 30 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదన్నారు. కొడంగల్ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. ఈ ప్రాంతానికి ఎన్నో అభివృద్ధి ప్రాజెక్టులు రానున్నాయని వెల్లడించారు. కొడంగల్ ఎత్తిపోతల పథకం సహా పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రూ.9 వేల కోట్లతో కొడంగల్‌లో అభివృద్ధి పనులు జరుగుతాయని పేర్కొన్నారు. కొడంగల్‌ను దేశానికే ఆదర్శంగా నిలిపేలా అభివృద్ధి చేస్తామని సీఎం అన్నారు. స్థానికంగా విద్యా అవకాశాలను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు.

– కొడంగల్, బతుకమ్మ

## కంకర క్రషర్‌తో
# గోపన్నపల్లి ఖకావికలం..!

### ఇళ్లకు పగుళ్లు.. పట్టించుకునే నాథుడే లేడు..!



బిచ్కుంద మండలం గోపనపల్లి గ్రామస్తులకు కంకర క్రషర్ శాపంగా మారింది. ఏళ్ల తరబడి క్రషర్ నుంచి వస్తున్న దుమ్ము, శబ్దం, ప్రకంపనలతో గ్రామం మొత్తం అల్లాడిపోతోంది. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రషర్‌లో రాళ్లు పేల్చేటప్పుడు, క్రష్ చేసేటప్పుడు వచ్చే ప్రకంపనలకు గ్రామంలోని ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయి. పేదవాడు కష్టపడి కట్టుకున్న ఇల్లు కళ్ల ముందే పగుళ్లు బారి, కూలిపోయే పరిస్థితికి వచ్చింది.

2 లో

– బిచ్కుంద, బతుకమ్మ

## త్వరలో నిజామాబాద్‌కు
# నితిన్ నవీన్ పర్యటన

### ఎంపీ అర్వింద్ ధర్మపురి విజ్ఞప్తికి సానుకూల స్పందన

దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ చేపడుతున్న వివిధ యాత్రలు, కార్యక్రమాల్లో భాగంగా నిజామాబాద్‌లో కూడా పర్యటించి, యాత్ర నిర్వహించాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ బీజేపీ జాతీయ అధ్యక్షులు శ్రీ నితిన్ నబీన్‌ను కోరారు.ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పార్టీకి ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన ప్రాంతమని, ఇక్కడ పార్టీ కార్యకర్తలు ప్రజలతో మమేకమై వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు. జాతీయ స్థాయి నాయకత్వం నిజామాబాద్‌లో పర్యటించడం ద్వారా పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నెలకొనడంతో పాటు, ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమయ్యే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఎంపీ అర్వింద్ విజ్ఞప్తిపై జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ సానుకూలంగా



2 లో

స్పందించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర పర్యటనకు సంబంధించి నా షెడ్యూల్ ఇంకా ఖరారు కాలేదని, పర్యటన తేదీలు, కార్యక్రమాలు ఖరారైన వెంటనే నిజామాబాద్‌లో కూడా యాత్ర నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తానని ఎంపీకి తెలిపారు.

– నిజామాబాద్, బతుకమ్మ

## 32 గల్ఫ్ మృతుల కుటుంబాలకు
# రూ.1.60
### ఎక్స్‌గ్రేషియా

ఒక్కో గల్ఫ్ మృతుని కుటుంబానికి రూ.5 లక్షలు

కామారెడ్డి జిల్లాలో 15, నిజామాబాద్ జిల్లాలో 17 మందికి సాయం



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రూ.5 లక్షల గల్ఫ్ ఎక్స్‌గ్రేషియా పథకంలో భాగంగా మరో 32 మంది గల్ఫ్ కార్మికుల మృతుల కుటుంబాలకు మొత్తం రూ.1.60 కోట్ల ఆర్థిక సహాయం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 3వ తేదీన సాధారణ పరిపాలన (ఎన్ఆర్ఐ) శాఖ జారీ చేసిన జీఓ నెం.1603 ద్వారా ఈ ఆర్థిక సహాయానికి పరిపాలనా అనుమతి లభించింది.

2 లో

– నిజామాబాద్ సిటీ, బతుకమ్మ

### గిఫ్ట్ ఏ స్మైల్"లో విద్యార్థి మహేష్‌కు

# ల్యాప్‌టాప్ అందజేసిన కేటీఆర్

హైదరాబాద్, బతుకమ్మ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేపట్టిన గిఫ్ట్ ఏ స్మైల్?కార్యక్రమంలో భాగంగా దేవరకద్ర నియోజకవర్గానికి చెందిన నిరుపేద విద్యార్థి మహేష్‌కు ల్యాప్‌టాప్ అందజేశారు. విద్యార్థి మహేష్ ఇంజినీరింగ్ పూర్తి చేసి,కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన డేటా అనలిటిక్స్ కోర్సు కోసం సిద్ధమవుతున్నాడు. మహేష్ చదువుకు ల్యాప్‌టాప్ అవసరమని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కేటీఆర్,గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా తన చేతుల మీదుగా విద్యార్థి మహేష్‌కు ల్యాప్‌టాప్ అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ విద్యార్థి మహేష్‌ను అభినందించారు. ఉన్నత విద్యలో మరింత రాణించాలని, ఎంచుకున్న కోర్సులో మంచి ప్రతిభ కనబరిచి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆళ్ల వెంకటేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన



కార్యదర్శి రావుల చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అండగా నిలుస్తూ, వారి కలలను సాకారం చేసుకునేందుకు తోడ్పాటునందించడమే గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం లక్ష్యమన్నారు.

### మెగా రైతు మేళా,

### పారిశ్రామిక ప్రదర్శనను ప్రారంభించిన సీఎం



కొడంగల్, బతుకమ్మ : రాష్ట్ర ప్రభుత్వం వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేటలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో వ్యవసాయ ఉత్పత్తులు, ఆధునిక పరికరాలు, పనిముట్లు, ఇతర వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఉత్పత్తులతో పాటు పారిశ్రామిక ఉత్పత్తులు, ఏరోస్పేస్, రక్షణ రంగాలకు చెందిన సాంకేతిక పరిజ్ఞానం, గ్రీన్ టెక్నాలజీ, పునరుత్పాదక ఇంధన వనరులు, వ్యవసాయ ఆధారిత ఇతర పారిశ్రామిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ప్రదర్శించారు.మెగా రైతు మేళా ప్రారంభోత్సవంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వర రావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి, ఎంపీలు, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సహచర మంత్రులతో కలిసి



స్టాళ్లను పరిశీలించారు. ఆయా ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులందరూ ఈ మేళాలోని స్టాళ్లను సందర్శించి వ్యవసాయ రంగంలో ఆధునిక మేళకువలను తెలుసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

### త్వరలో నిజామాబాద్‌కు

# నితిన్ నవీన్ పర్యటన

జాతీయ అధ్యక్షులు తన విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించడం పట్ల ఎంపీ అర్వింద్ ధర్మపురి సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ పర్యటన ఖరారైన అనంతరం నిజామాబాద్ పర్యటనకు సంబంధించి తగిన ఏర్పాట్లు, కార్యక్రమాల రూపకల్పనపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటామని తెలిపారు. దీపావళి పండుగ అనంతరం ఢిల్లీలో జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్‌ను ప్రత్యక్షంగా కలిసి, నిజామాబాద్ పర్యటనకు అధికారికంగా ఆహ్వానించనున్నట్లు ఎంపీ అర్వింద్ వెల్లడించారు. జాతీయ అధ్యక్షుల పర్యటన ద్వారా నిజామాబాద్ ప్రాంతంలో పార్టీ కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యత లభిస్తుందని, కార్యకర్తలకు జాతీయ నాయకత్వంతో నేరుగా మమేకమయ్యే అవకాశం కలుగుతుందని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు.



ఫైల్ ఫోటో

# కంకర క్రషర్‌తో గోపన్పల్లి కకావికలం..!

రాత్రిపూట ఇంట్లో పడుకోవాలంటే భయమేస్తోందని మహిళలు కన్నీటి పర్యంతమవుతున్నారు.ఒకవైపు పగుళ్లు, మరోవైపు దుమ్ము. క్రషర్ నుంచి లేస్తున్న దుమ్ము గ్రామం మొత్తాన్ని కమ్మేస్తోంది. పిల్లలు, ముసలివాళ్లు దగ్గు, ఆస్తమా, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్నారు. పంట పొలాల మీద దుమ్ము పేరుకుపోయి పంటలు కూడా దెబ్బతింటున్నాయి. తాగే నీరు సైతం కలుషితమవుతోందని గ్రామస్తులు వాపోతున్నారు.

**అధికారుల మౌనం వెనుక మతలబు ఏంటి..?**

క్రషర్ కు అనుమతులు ఉన్నాయా? నిబంధనల ప్రకారం గ్రామానికి ఎంత దూరంలో ఉండాలి? అనే ప్రశ్నలకు అధికారుల దగ్గర సమాధానం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే వారు క్రషర్ కు వచ్చి చూసి వెళ్లిపోవడం తప్ప, చర్యలు మాత్రం శూన్యమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. క్రషర్ యాజమాన్యంతో అధికారులు కుమ్మక్కయ్యారనే అనుమానం ఉందని లేకుంటే ఏళ్ల గడుస్తున్నా ఒక్క క్రషర్ ని ఆపలేరా అని గ్రామస్తులు నిలదీస్తున్నారు. నిబంధనలు పాటించని కంకర క్రషర్ ను వెంటనే సీజ్ చేయాలని, పగుళ్లు వచ్చిన ఇళ్లకు నష్టపరిహారం ఇప్పించాలని, గ్రామస్తుల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, దుమ్ము నివారణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, మైనింగ్, పొల్యూషన్ అధికారులు స్పందించకపోతే, గ్రామస్తులంతా కలిసి క్రషర్ ముందు, కలెక్టరేట్ ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

# మైనర్ల చేతుల్లో ట్రాక్టర్ల స్టీరింగ్..

### పట్టించుకోని అధికారులు..



కమ్మర్‌పల్లి, బతుకమ్మ :కమ్మర్‌పల్లి మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో మైనర్ బాలుడు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే ట్రాక్టర్లు నడుపుతున్న ఫోటోను "బతుకమ్మ" క్లిక్ మనిపించింది.. నిబంధనలను బేఖాతరు చేస్తూ చిన్న వయసులోనే ట్రాక్టర్ల స్టీరింగ్ పట్టుకుని రోడ్లపైకి వస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ పనుల పేరుతో ట్రాక్టర్లను రోడ్లపైకి తీసుకువస్తున్న కొందరు యజమానులు, సరైన వయసు లేని బాలురకు డ్రైవింగ్ బాధ్యతలు అప్పగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుభవం లేకుండా ట్రాక్టర్లు నడపడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయానికి గురవుతున్నారు. అలాంటి వాహనాలను మైనర్లు నడపడం వల్ల ప్రమాదాలు జరిగితే అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?**

మైనర్ బాలుడికి ట్రాక్టర్ ఇచ్చిన యజమానిదా? తల్లిదండ్రులదా? లేక నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.మైనర్లతో వాహనాలు నడిపించే ట్రాక్టర్ యజమానులపై, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మండలంలోని మారుమూల గ్రామాల్లో కూడా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత పోలీస్, రవాణా శాఖ అధికారులు స్పందించి మైనర్ల చేతుల్లో ట్రాక్టర్ల స్టీరింగ్‌కు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

# 32 గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.1.60 కోట్ల ఎక్స్‌గ్రేషియా

ఇందులో కామారెడ్డి జిల్లాకు చెందిన 15 మంది మృతుల కుటుంబాలకు రూ.75 లక్షలు, నిజామాబాద్ జిల్లాకు చెందిన 17 మంది మృతుల కుటుంబాలకు రూ.85 లక్షలు మంజూరు చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.1 కోటి 60 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం ఆమోదించింది. 2023 డిసెంబర్ 7వ తేదీ నుంచి తెలంగాణకు చెందిన కార్మికులు బహ్రెయిన్, కువైట్,?ఇరాక్, ఒమన్,ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ దేశాల్లో మరణించిన సందర్భంలో వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం గతంలో నిర్ణయించిందన్నారు.

# కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన టీఎన్జీవో నాయకులు

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : దీపావళి పండుగను పురస్కరించుకొని జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్, కార్యదర్శి నేతికుంట శేఖర్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అడిషనల్ కలెక్టర్లు భుజంగరావు, రాజాగౌడ్ లకు, డీఆర్వో గీతని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ



కార్యక్రమంలో కోశాధికారి నిరంజన్ గౌడ్, ఉపాధ్యక్షులు శివకుమార్ గౌడ్, జాఫర్ హుస్సేన్, అర్బన్



సెక్రెటరీ మారుతి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సునీల్ కుమార్ లు పాల్గొన్నారు.

# సంక్రాంతి తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ప్రజాబలం పర్యటనలు

కందులు, జొన్నలకు ప్రాధాన్యం పెరగాలంటే ప్రాంతీయ అభివృద్ధి అవసరమన్నారు. రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని సూచించారు. నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. కొడంగల్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులతో ప్రాంత రూపురేఖలు మారనున్నాయని చెప్పారు. కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, ఎంపీ మల్లు రవి పాల్గొన్నారు.

# ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

### సాగునీరు అందక ఎండిపోతున్న వరి, పత్తి పంటలు

### రైతుల కష్టాలు పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వంపై కొప్పుల ఈశ్వర్ ఆగ్రహం



జగిత్యాల, బతుకమ్మ : జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దొంతాపూర్‌లో సాగునీరు అందక ఎండిపోతున్న పంట పొలాలను శనివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరిశీలించారు. పంటలు ఎండిపోయి ఆందోళనలో ఉన్న రైతులు మండల లింగయ్య, మండల భీమయ్య, చంద్రయ్య తదితరులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పెట్టుబడులు పెట్టిన రైతులకు కనీసం పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అవగాహనారాహిత్యం వల్లే రాష్ట్రంలో రైతాంగం తీవ్రంగా నష్టపోతోందన్నా రు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ సహకారంతో రూ.400 కోట్ల వ్యయంతో ఆర్ఎఫ్ఎల్ నుంచి ముత్తూరు వరకు 14 లిఫ్టులు ఏర్పాటు చేశామని, వాటిలో దొంతాపూర్ లిఫ్ట్ కూడా ఒకటి అని అన్నారు. గత ఆరు నెలలుగా దొంతాపూర్ లిఫ్ట్ లో 2–3 మోటార్లు పనిచేయకపోయినా ప్రభుత్వం పట్టించుకోవ డం లేదని, గోదావరి పక్కనే ఉన్నా పంటలకు నీరందక ఎండిపోవడం బాధాకరమన్నారు. స్థానిక మంత్రి లక్ష్మణ్ కుమార్ రైతుల సమస్యలను పట్టించుకోకుండా కలెక్టర్ వద్దకు వెళ్లాలని చెప్పడం బాధ్యతారాహిత్యమన్నారు.
దొంతాపూర్ రోడ్డు అధ్వానంగా మారిందని, గతంలో మంజూరైన రూ.32 కోట్ల రోడ్డు పనులను కూడా ప్రస్తుత నాయకత్వం ముందుకు తీసుకెళ్లలేకపోతోందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు వచ్చే అవకాశం ఉందని తెలిసినా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని, గోదావరిలో నీరున్నా కన్నెపల్లి నుంచి ఎత్తిపోతలు చేపట్టడం లేదన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఎల్‌నినో పేరుతో పంటలు వేయవద్దని ప్రచారం చేయడం వల్లే రాష్ట్రంలో దాదాపు 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయ ని,కరోనా వంటి క్లిష్ట సమయంలోనూ కేసీఆర్ రైతుబంధు సహా ఏ సంక్షేమ పథకాన్నీ నిలిపివేయలేదని, రాష్ట్రంలోని 661 మండలాలకు గాను 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినా రైతులకు ఎలాంటి ఆర్థిక సహాయం అందించడం లేదన్నారు. మూడో విడత రైతుబంధు ఎగొట్టారు. రైతుబీమాను కూడా సక్రమంగా అమలు చేయడం లేదని, కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాధారం. పిల్లర్ల మరమ్మతులు చేపడితే సాగునీటి సమస్యను అధిగమించే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎండిపోయిన పంటలకు తక్షణమే పరిహారం అందించాలని, కరువు మండలాల రైతులకు ఆర్థిక సహాయం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దొంతాపూర్ లిఫ్ట్ మోటార్లకు వెంటనే మరమ్మతులు చేపట్టి సాగునీరు అందించాలని, రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వం వస్తే తప్ప రైతాంగానికి భరోసా లేదని కొప్పుల ఈశ్వర్ అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, అయ్యోరి రాజేష్,సంగి శేఖర్,పలువురు నాయకులు, స్థానిక బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# మోపాల్ మండల అభివృద్ధికి రూ.1.35 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం





నిజామాబాద్ రూరల్, బతుకమ్మ : మోపాల్ మండలంలోని బాడ్సి, సింగంపల్లి, చిన్నాపూర్, కాల్పోల్, బైరాపూర్ గ్రామాల్లో మొత్తం రూ.1.35 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రారంభించడంతో పాటు పలు పనులకు శనివారం శంకుస్థాపనలు చేశారు.ముందుగా బాడ్సి గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే ఆలయం వద్ద ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి రూ.5 లక్షలతో శంకుస్థాపన చేశారు. అనంతరం సింగంపల్లి, చిన్నాపూర్ గ్రామాల్లో రూ.10 లక్షల చొప్పున నిర్మించిన మహిళా సంఘ భవనాలను ప్రారంభించారు. బాడ్సి గ్రామంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. కాల్పోల్ గ్రామంలో రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి, రూ.50 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బాడ్సి గ్రామ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు రూ.22.82 కోట్ల నిధులు తీసుకువచ్చామని తెలిపారు. గ్రామ పంచాయతీ భవనానికి రూ.20 లక్షలు??శివాలయ కాంపౌండ్ వాల్‌కు రూ.10 లక్షలు,?ముదిరాజ్ సంఘ భవనానికి నిధులు?రూ.2.60 కోట్లతో వంతెన నిర్మాణం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. మోపాల్ మండలంలోని ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. నిరుపేదలకు 75 గజాల ఇంటి స్థలం అందించేలా ప్రయత్నిస్తామని, పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.
అంతర్జాతీయంగా యుద్ధ పరిస్థితుల కారణంగా డాంబర్ వంటి ముడిసరుకుల దిగుమతి, ధరల్లో మార్పుల వల్ల రోడ్డు పనుల్లో కొంత జాప్యం జరుగుతోందని వివరించారు.

# అమరవీరుల ఆశయ సాధనకై పోరాడుదాం

### సిపిఐ ఎం–ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి పుట్ట వరదయ్య



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : భూమికోసం, భుక్తి కోసం దోపిడి వ్యవస్థ అంతం కోసం పోరాడిన అమరవీరుల ఆశయ సాధనకై పోరాడుదామని న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి పుట్ట వరదయ్య పిలుపునిచ్చారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాగారంలో అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించారు.ఈ సభను ఉద్దేశించి న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి పుట్ట వరదయ్య మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగిస్తు న్నాయని విమర్శించారు. నిత్యవసర వస్తువుల సరుకుల ధరలు పెరిగి ప్రజలపై భారం పడుతున్న పట్టించుకోవడం లేదని అన్నారు .రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు . కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని ప్రజల తరపున డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడు లను తక్షణం రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని కోరారు .సర్ పేరు మీద కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రజల ఓట్లను తొలగించడాన్ని అందరూ ఖండించాలని విజ్ఞప్తి చేశారు .సర్ ప్రక్రియను రద్దు చేయాలని భారత చీఫ్ ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు .విప్లవోద్యమంలో అసువులు బాసిన కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి, కామ్రేడ్ పొట్ల రామ నరసయ్య, నీలం రామచంద్రయ్య, తరిమెల నాగిరెడ్డి, చారు మజుందర్, కానూ సన్యాల్ జంపాల చంద్రశేఖర ప్రసాద్, వేములపల్లి కిరణ్ కుమార్ తదితరులకు ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్, ఐ ఎఫ్ టి యు జిల్లా ఉపాధ్యక్షుడు శివరాజ్,పి ఓడబ్యూజిల్లా నాయకురా లు లతా, ఐ ఎఫ్ టి యు నాయకులు కృష్ణ, గంగాధర్,సుశీల తదితరులు పాల్గొన్నారు.

### కమిషన్ లేనిదే పనిచేయని

# యూనివర్సిటీ రిజిస్ట్రార్

### స్పాట్ అడ్మిషన్ నిర్వహించాలని యెండల ప్రదీప్ భిక్షాటన



డిచ్ పల్లి, బతుకమ్మ : తెలంగాణ విశ్వవిద్యాలయంలో డబ్బులు వచ్చే పనిలో ముందుండే కమిషన్ల కోసం తాపత్రయపడుతూ విద్యను విద్యార్థులకు దూరం చేస్తున్న రిజిస్ట్రార్ గత నాలుగు రోజుల నుంచి విశ్వవిద్యాలయంలో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేయాలని వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకోని యూనివర్సిటీ యంత్రాంగానికి శనివారం భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయంలో గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు చదువుకోవడానికి అవకాశం కల్పించాలంటూ వినతి పత్రాలు ఇచ్చిన నిమ్మకు నీరెత్తిన విధంగా వ్యవహరించడంపై భిక్షాటన చేసి డబ్బులు ఇస్తామని నిరసన వ్యక్తం చేశారు. కొన్ని డిపార్ట్ మెంట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించి ఇప్పుడు మిగిలిన డిపార్ట్ మెంట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించకపో వడంపై ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. కొద్ది రోజుల క్రితమే విశ్వ విద్యాలయంలోని బోధన సిబ్బందికి అందరికి కూడా ప్రమోషన్లు ఇవ్వడం జరిగిందని, ఒక్క బోధన సిబ్బంది వెనుక ఏరియర్స్ రూపంలో లక్షల రూపాయలు వారికి ఇవ్వడం జరుగుతుందన్నారు. లక్షల రూపాయలు ఇచ్చి విద్యార్థులను విద్యకు దూరం చేయడంపై ఆంతర్యం ఏంటని విద్యార్థి నాయకులు ఎండల ప్రదీప్ ప్రశ్నించారు. అందుకే భిక్షాటన చేసి వారికి ఎన్ని డబ్బులు కావాలని అన్ని ఇస్తామని నిరసన తెలియజేశారు. ఇప్పటికైనా విద్యార్థులకు చదువుకునే అవకాశాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రిత్విక్, తరుణ్, రాహుల్, ప్రణవ్, వినయ్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

### గౌడ సంఘం ఆత్మగౌరవ భవన నిర్మాణానికి

# రూ.5 కోట్ల నిధులు మంజూరు

### ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కు గౌడ సంఘం ప్రతినిధుల కృతజ్ఞతలు



హైదరాబాద్, బతుకమ్మ : గౌడ సంఘం ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయడంపై గౌడ సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను గౌడ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గౌడ సంఘం ఆత్మగౌరవానికి, ఐక్యతకు ప్రతీకగా నీలిచేలా భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ భవనం గౌడ సామాజిక వర్గ అభ్యున్నతికి, సంఘ టిత శక్తికి చిరస్థాయిగా నిలిచే కేంద్రంగా రూపుదిద్దుకోనుందని ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఛైర్మన్ చంద్ర శేఖర్ గౌడ్, వైస్ ఛైర్మన్ నాగరాజు గౌడ్, పీపీ దయాకర్ గౌడ్, జనరల్ సెక్రటరీలు సత్యం గౌడ్, రామారావు గౌడ్, చక్రవర్తి గౌడ్, రామన్ గౌడ్,శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కిష్టాపూర్ శివారులో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

### ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

### మూడు బైక్‌లు,5 సెల్‌ఫోన్లు,రూ.7,350 నగదు స్వాధీనం

బాన్సువాడ, బతుకమ్మ : కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై బీర్కూర్ పోలీసులు దాడి నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో బీర్కూర్ ఎస్ఐ రాములు, స్పెషల్ టీం సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు.ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లు, రూ.7,350 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాములు తెలిపారు.

## జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం



డిచ్ పల్లి, బతుకమ్మ : జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్ 1 అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎన్ఎస్ఎస్ యూనిట్ -1?ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సీ హెచ్ శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వ్యాధి లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్య చికిత్స పొందడం ద్వారా క్యాన్సర్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, పోషకాహారం, వ్యాయామం,పొగాకు, మద్యపానానికి దూరంగా ఉండటం ద్వారా క్యాన్సర్ ముప్పును కొంతవరకు తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. ర్యాలీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1?వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని క్యాన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపు, చికిత్స ప్రాముఖ్యతను తెలియజేస్తూ వివిధ నినాదాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. క్యాన్సర్ పట్ల భయాన్ని వీడి, వ్యాధిపై సరైన అవగా హన పెంపొందించుకోవాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 వాలంటీర్లు గౌతమ్ మనోహర్, బాలమణి, మణిదీప్, కలీం, రోహన్, స్వాతి, త్రిష ,శశిక, నీరజ, సుస్వర, హారిక, పృథ్వి ,సౌందర్య, శ్రావణి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బీడీ కాలనీలో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

### 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌తో మెరుగుపడనున్న విద్యుత్ సరఫరా



బాన్సువాడ, బతుకమ్మ : బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు బీడీ కార్మికుల కాలనీలో విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు విద్యుత్ శాఖ అధికారులు నూతనంగా 25 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కాలనీలో విద్యుత్ లోడ్ అధికంగా ఉండటంతో తరచూ ఎదురవుతున్న అంతరాయాలు, తక్కువ వోల్టేజీ సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ సంతోష్ కుమార్, స్థానిక కౌన్సిలర్ జంగం రాజశేఖర్, కోఆప్షన్ సభ్యుడు మజ్జు నూతన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు.కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడంతో కాలనీలో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని, స్థానిక ప్రజలకు ఎదురవుతున్న విద్యుత్ సమస్యలు తొలగుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది బీర్మల్, రాజేంద్ర ప్రసాద్, బలరాం, అశోక్ రెడ్డి, అరవింద్, స్థానిక నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## నానో ఎరువులపై క్షేత్ర ప్రదర్శన

### నానో ఎరువులతో సాగు ఖర్చు తగ్గింపు

### -దిగుబడి పెంపుపై రైతులకు అవగాహన




భీమ్ గల్, బతుకమ్మ :మండలంలోని చెంగల్, భీమ్ గల్ గ్రామాల్లో ఆత్మ (ఏటీఎంఏ ) వారి ఆధ్వర్యంలో నానో యూరియా, నానో డీఏపీ ఎరువుల వినియోగంపై క్షేత్ర ప్రదర్శన కార్యక్రమంను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు నానో ఎరువుల వినియోగం, పిచికారీ విధానం, నానో టెక్నాలజీపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. నానో యూరియా, నానో డీఏపీ ఎరువులను సరైన పద్ధతిలో వినియోగించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకో వచ్చని, పంట పోషక యాజమాన్యాన్ని మెరుగుపరచుకోవచ్చని అధికారులు వివరించారు. నానో ఎరువుల పిచికారీ విధానాన్ని క్షేత్రస్థాయిలో ప్రదర్శించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు నానో యూరియా, నానో డీఏపీ ఎరువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమ్ గల్ మండల వ్యవసాయ అధికారి బద్దం లావణ్య, గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి డి. స్నేహ, వ్యవసాయ విస్తరణ అధికారులు దివ్య, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాటరీలు ఇన్వర్టర్‌లను దొంగతనం చేస్తున్న ఇద్దరు దొంగలు అరెస్ట్




బాల్కొండ , బతుకమ్మ : బాల్కొండ శివారులో బైపాస్ రోడ్డులోని నేషనల్ హైవే వాళ్లకు సంబంధించిన మూడు బ్యాటరీలు, మూడు ఇన్వర్టర్ లను దొంగతనం చేసిన ఇద్దరు అంతర్రాష్ట్ర సభ్యులను అరెస్టు చేసినట్లు బాల్కొండ ఎస్సై యాసిర్ అర్ఫత్ తెలిపారు. శనివారం పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ షంషేర్ సింగ్ , సహజ్ ప్రీత్ సింగ్ లు ఉత్తర ప్రదేశ్ లోని పిలిభిత్ జిల్లాకు చెందిన వారు. వీరు లారీ డ్రైవర్లుగా పని చేస్తున్నారు. వీరు దారి వెంట వెళ్లే క్రమంలో లారీల బ్యాటరీలు, ఇన్వర్టర్లను దొంగతనం




చేస్తుంటారన్నారు. గంజాల్ టోల్ ప్లాజా మేనేజర్ సంతోష్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శనివారం వీరిద్దరిని పట్టుకొని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. వీరి వద్ద



మూడు బ్యాటరీలు, మూడు ఇన్వర్టర్లు, ఒక ఐరన్ రాడ్ , ఎన్ ఎల్ 01 ఎఐఫ్ 8882 వీరు ఉపయోగించిన లారీని లారీ సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

# ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

### జనసమ్మర్ధ ప్రాంతాల్లో పోలీసుల నిరంతర పర్యవేక్షణ



నిజామాబాద్ క్రైం, బతుకమ్మ :దీపావళి పండుగను పురస్కరించుకొని నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు, అసౌకర్యాలు కలగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు పోలీసు కమిషనర్ సాయిచైతన్య తెలిపారు. శనివారం నగరంలోని ప్రధాన రద్దీ ప్రాంతాలను స్వయంగా సందర్శించి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గాంధీ చౌక్, దేవీ రోడ్డు, ఫ్లై ఓవర్ బ్రిడ్జిలను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. ఎక్కువ జనరద్ధీ గల ప్రాంతాలలో ట్రాఫిక్ స్పెషల్ టీంలను ఏర్పాటు చేసి ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించారు. ఇందులో భాగంగా ఫుట్‌పాత్‌ల పక్కన వ్యాపారాలు నిర్వహిస్తున్న షాపుల యజమానులతో మాట్లాడి వారి వ్యాపారాలకు సంబంధించిన వివరాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పాదచారులకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యాపారులు తగిన సహకారం అందించాలని సూచించారు. ప్రధాన రహదారులు, ఫుట్‌పాత్‌లపై అనవసరంగా వస్తువులు ఏర్పాటు చేయకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసుకోవాలని సూచించారు. ప్రజలు ప్రశాంతంగా పండుగ కొనుగోళ్లు చేసుకునేలా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సంబంధిత పోలీస్ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజల భద్రత, సౌకర్యం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని, పండుగ వేళ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు




కలగకుండా పోలీస్ శాఖ నిరంతరం అందుబాటులో ఉంటుందని సీపీ తెలిపారు. పండుగ సందర్భంగా జనసమ్మర్ధం అధికంగా ఉండే మార్కెట్లు, ప్రధాన రహదారులు, షాపింగ్ ప్రాంతాలు, వ్యాపార సముదాయాల వద్ద ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, షీ టీమ్స్ బృందాలను రంగంలోకి దించి నిరంతరం పర్యవేక్షణ చేపట్టడం జరిగిందన్నారు. ప్రజల భద్రత, మహిళల రక్షణతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. సీపీ వెంట నిజామాబాద్ టౌన్ వన్ ఎస్ హెచ్ఓ శ్రీనివాస్, ట్రాఫిక్ సిఐ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత వికాసం, లక్ష్యాల సాధనకు పుస్తకపఠనం దోధపడుతుంధి

### గ్రామీణ విద్యార్థులకు జ్ఞానదీపికగా అక్షరకృషి గ్రంథాలయం

### -దేవన్‌పల్లిలో గ్రంథాలయ ఏర్పాటుకు నిర్ణయం, ఈ నెల 10న ప్రారంభోత్సవం.

### ఏబీపీఎస్ నేషనల్ ప్రెసిడెంట్ ప్రభోధ సమీర్

భీమ్‌గల్, బతుకమ్మ : :పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసానికి, ఉన్నత లక్ష్యాల సాధనకు ఎంతగానో దోహదపడుతుందని ప్రభోధ సాధన ఎడ్యుకేషన్ అండ్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ నేషనల్ ప్రెసిడెంట్ ప్రభోధ సమీర్ అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువతలో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించి, వారి భవిష్యత్తుకు జ్ఞానాన్ని బలమైన పునాదిగా అందించాలనే లక్ష్యంతో అక్షరకృషి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. భీమ్‌గల్ మండలం దేవన్‌పల్లి గ్రామంలో అఖిల భారతి ప్రబోధ ఎడ్యుకేషనల్ అండ్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ (ఏబీపీఎస్ ) ఆధ్వర్యంలో సూత నంగా 'అక్షరకృషి గ్రంథాల యం' ఏర్పాటు చేయాలని సొసైటీ జనరల్ సెక్రెటరీ అధ్యక్షతన నిర్వహించిన అత్యవసర సమావేశంలో నిర్ణయిం చినట్లు వెల్లడించారు.ఈ సంద ర్భంగా ప్రబోధ సమీర్ మాట్లా డుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది విద్యార్థుల్లో ప్రతిభ ఉన్నప్పటికీ, తగిన పుస్తకాలు,విజ్ఞాన వనరులు అందుబాటులో లేకపో వడం వల్ల వారి ప్రతిభకు సరైన ప్రోత్సాహం లభించడం లేదన్నారు. అక్షరకృషి గ్రంథాలయం ద్వారా విద్యార్థులు, యువతకు వివిధ అంశాలపై విజ్ఞానం అందించడంతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఉపయోగపడే పుస్తకాలను అందుబాటులోకి తీసుకురావాలన్నది తమ లక్ష్యమన్నారు. గ్రంథాలయం కేవలం పుస్తకాలు చదివే ప్రదేశంగా కాకుండా, విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని, క్రమశిక్షణను, సామాజిక బాధ్యతను పెంపొందించే విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలని సంకల్పించినట్లు తెలిపారు. ఈ నెల 10వ తేదిన దేవన్‌పల్లిలో అక్షరకృషి గ్రంథాలయ ప్రారం భోత్సవాన్ని నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సొసైటీ ప్రతినిధులు, ఉపాధ్యాయు లు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల ప్రతినిధులు



హాజరుకానున్నారని తెలిపారు. గ్రామీణ విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించి ఈ గ్రంథాలయాన్ని విజయవంతం చేయాలని ప్రబోధ సమీర్ కోరారు.

## నాటుబాంబుల పేలుడు ఘటనలో గాయపడిన వ్యక్తి మృతి

### చికిత్స పొందుతూ రమేష్ కన్నుమూత..

### జనావాసాల మధ్య పేలుడు పదార్థాల తయారీతో ప్రమాదం

బాన్సువాడ, బతుకమ్మ : బాన్సువాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాడుకోలు గ్రామ పంచాయతీ పరిధి రాజారాం దుబ్బ గ్రామంలో నాటుబాంబుల పేలుడు ఘటనలో తీవ్రంగా గాయ పడిన కడమంచి రమేష్ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.ఈ నెల 1వ తేదీన అడవి పందుల వేటకు వెళ్లేందుకు నాటు బాంబులు సిద్ధం చేస్తుండగా ప్రమా దవశాత్తు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో కడమంచి రమేష్‌తో పాటు పలువురికి తీవ్ర గాయా లయ్యాయి. తీవ్రంగా గాయపడిన రమేష్‌ను మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నవంబర్ 7వ తేదీ ఉద యం మృతి చెందినట్లు బాన్సువాడ పోలీసులు వెల్లడించారు.

### జనావాసాల మధ్య నాటుబాంబుల తయారీ

జనావాసాల మధ్య నాటుబాంబులు తయారు చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహ రించడం వల్లే ఈ ప్రమాదం జరిగి నట్లు విచారణలో వెల్లడైందని పోలీ సులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసా గిస్తున్నారు.

### పేలుడు పదార్థాల తయారీ చట్టరీత్యా నేరం.

నాటుబాంబులు, పేలుడు పదార్థాల ను తయారు చేయడం, నిల్వ చేయ డం, వినియోగించడం చట్టరీత్యా నేరమని పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి ప్రమాదకర చర్యలకు ఎవ



రూ పాల్పడవద్దని, ఎక్కడైనా పేలు డు పదార్థాల తయారీ లేదా నిల్వకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అర్హులైన పేదలకు మిగులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలి.

**తహసిల్దార్ కు వినతి పత్రం అందజేసిన మాజీ ఎంపీపీ,మాజీ జడ్పీటీసీ**

కాల్వ శ్రీరాంపూర్, బతుకమ్మ :మండల కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లల్లో మిగిలి ఉన్న 80 డబుల్ బెడ్ రూమ్ లను అర్హులైన నిరుపేదలకు కేటాయించాలని మాజీ ఎంపీపీ నూనెటి సంపత్ యాదవ్, మాజీ జడ్పిటీసీ వంగళ తిరుపతి రెడ్డిలు తహసీల్దార్ కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గౌరవ తెలంగాణా రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం మేరకు పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి చొరవ,సహకారంతో,కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో కొన్ని కోట్ల రూపాయలు వెచ్చించి 240 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించడం జరిగిందన్నారు.దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేద ప్రజలను గుర్తించి అప్పుడున్న ఎమ్మార్వో, ఆర్డీవో,ఎంపీపీ, జెడ్పిటిసి, ఆయా గ్రామాల సర్పంచ్లు 160 మంది లబ్ధిదారులను గుర్తించి ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. .ఇప్పుడున్న ప్రభుత్వం మరి ఏదైతే ఇంతకు ముందు తాము ఎంపిక చేసిన 160 మంది లబ్ధిదారులను అర్హులుగా కొనసాగించాలన్నారు. మిగతా 80 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు అర్హులను కొత్తగా గుర్తించి వారికి కేటాయించాలని వారు కోరారు .ప్రస్తుతం డబుల్ బెడ్రూం ఇళ్లలో నీటి వసతి, విద్యుత్ సప్లై లేదని, పూర్తి పనులు చేపట్టి పనుల పూర్తయిన తర్వాతనే లబ్ధిదారులకు కేటాయించాలని వారు తహసీల్దార్ ను కలిసిన కోరారు. ఈ కార్యక్రమంలో కాల్వ మాజీ వైస్ ఎంపీపీ జూకంటి శిరీష అనిల్, సర్పంచ్లు భూసి సదాశివ రెడ్డి ,మంతెన రాజయ్య ,తీగల నాగరాజు ,అడిగొప్పుల రాణి మోహన్ , గరిడే అశోక్-లక్ష్మి ,మాజీ సర్పంచ్లు పుప్పాల నాగార్జున రావు,గోనె శ్యామ్,బుర్ర మంగ



సదానందం,ఆడెపు శ్రీదేవి-రాజు దొమ్మటి రజిత శ్రీనివాస్, ఇప్పలపల్లి ఉపసర్పంచ్ వేణు,మాజీ మల్యాల ఉప సర్పంచ్ లోనే సదయ్య,మాజీ ఉప సర్పంచ్ సుదాటి కరుణాకర్రావు,నాయకులు మోహన్,కళ్లేపల్లి సాగర్ ఉయ్యాల ఒదేలు,ఎరబాటి రవి,జక్కెనబోయిన కనుకయ్య,కాల్వ శ్రీరాంపూర్ మండల బీయర్ఎస్ పార్టీ యువ నాయకుడు కుంభం రాజు ముదిరాజ్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి...

**- ఇంచార్జ్ ఎస్సై ఎల్. రామ్...**

రుద్రూర్, బతుకమ్మ : విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాల వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో మెలగాలని రుద్రూర్ ఇంచార్జ్ ఎస్సై ఎల్.రామ్ విద్యార్థులకు సూచించారు. శనివారం రుద్రూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇంచార్జ్ ఎస్సై ఎల్. రామ్ మాట్లాడుతూ.. విద్యార్థులు గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత



చంద్రశేఖర్, ఉప సర్పంచ్ నిస్సార్, తహశీల్దార్ సురేందర్ నాయక్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఇంచార్జ్ ఎస్సై ఎల్. రామ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూరు చంద్రశేఖర్, బిజెపి పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్,



పంచాయతీ సెక్రటరీ ప్రేమ్ దాస్, వైద్యాధికారిణి డాక్టర్ అయోషా సిద్దిఖా, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తు.. డబ్బుల కోసం వేధింపులు..

# చివరకు కన్నకొడుకును హతమార్చిన తండ్రి!

బిక్కుంద,బతుకమ్మ: మద్యం మత్తులో తండ్రి కసాయిగా మారాడు. డబ్బుల కోసం జరిగిన గొడవ చివరకు కన్నకొడుకు ప్రాణాలను బలితీసుకుంది. ఆవేశంలో ఒక్క నిర్ణయం.. ఒక ప్రాణాన్ని బలితీసి, మరో జీవితాన్ని జైలు పాలు చేసిన ఘటన బిక్కుంద మండల కేంద్రంలో చోటు చేసుకుంది.

**అసలేం జరిగింది..?**

నిందితుడు మద్యం సేవించి డబ్బుల కోసం తల్లిదండ్రులతో కుమారుడు గొడవ పడినట్లు పోలీసులు తెలిపారు. డబ్బులు ఇవ్వాలని కుమారుడు వేధించడంతో, తండ్రికి ఆవేశం కట్టలు తెంచుకుంది. ఆవేశంలో తండ్రి తువ్వాలుతో కుమారుడి గొంతు నులిమి హత్య చేశాడు. కొడుకు అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. కన్నకొడుకును స్వయంగా చంపిన తండ్రి తీరు చూసి గ్రామస్తులు సైతం నివ్వెరపోయారు.

**నిందితుడి అరెస్ట్..!**

ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే బిక్కుంద పోలీసులు రంగంలోకి దిగారు. కేసును వేగంగా ఛేదించి నిందితుడైన తండ్రిని అరెస్ట్ చేశారు. హత్యకు ఉపయోగించిన లిఎరుపు రంగు తువ్వాలులిను స్వాధీనం చేసుకున్నారు. బిక్కుంద సర్కిల్ ఇన్స్పెక్టర్ . రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఈ కేసును త్వరగా పరిష్కరించారు. నిందితుడిని బిక్కుంద సర్కిల్ కార్యాలయంలో విచారించి, న్యాయస్థానంలో హాజరుపరిచారు.

**ఎస్పీ అభినందనలు..!**




ఈ కేసును వేగంగా ఛేదించిన బిక్కుంద పోలీసులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. మద్యం మత్తు, ఆవేశం ఎంతటి అనర్థానికి దారితీస్తుందో ఈ ఘటనే నిదర్శనమని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## పిప్రి ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో



భీమ్ గల్, బతుకమ్మ :మండలం లోని పిప్రి గ్రామ జడ్పిహెచ్ ఎస్ ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ గంగుల సంతోష్ కుమార్ శనివారం సందర్శించారు. పాఠశాల అవరణలో నిర్మించిన కమ్యూనిటీ సోక్ పిట్ ను ఆయన పరిశీలించారు.మధ్యాహ్న భోజనం ను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని హెడ్ మాస్టార్ ను కోరారు..గ్రామంలో మంజూరైనా 3 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణి చేసారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను త్వరతగతిన పూర్తి చేయాలని కోరారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ జనార్దన్, ఉప సర్పంచ్,పాఠశాల హెచ్.ఎం.లు,పీఎస్ జితేందర్, వార్డు సభ్యులు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన

## టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్, బతుకమ్మ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రజాసేవలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజల ఆశయాలను నెరవేర్చుతూ తెలంగాణను అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరింత ఉత్సాహంతో, అంకితభావంతో ముందుకు సాగాలని మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు.

## సీఎంని కలిసిన మాదిగ ఎంప్లాయీస్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు



హైదరాబాద్, బతుకమ్మ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నేతృత్వంలో మాదిగ ఎంప్లాయీస్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టాన్ని ఉద్యోగుల పదోన్నతుల్లో అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందుకు ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు తెలిపారు.ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి. కాశీం , చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లేశంతో పాటు పలువురు ప్రతినిధులు ఉన్నారు.

## రామడ్గులో మహిళ మెడలో నుంచి గొలుసు చోరి



ధర్పల్లి, బతుకమ్మ : ధర్పల్లి మండలం రామడ్గు గ్రామంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి చైన్ స్నాచర్లు బంగారు గొలుసును లాక్కెళ్లారు. గ్రామానికి చెందిన గడ్డం పద్మ తన ఇంటి నుంచి నిజామాబాద్ వెళ్లేందుకు బస్టాండ్ కు వెళ్తుండగా వెళ్తుండగా టీవీఎస్ బైక్ పై వచ్చిన చైన్ స్నాచర్లు మహిళ మెడలో నుంచి 3 తులాల బంగారు గొలుసును లాక్కొని అక్కడి నుంచి పరారీ అయ్యారు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై సందీప్ ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను త్వరితగతి పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

## ఆటో అద్దాలు పగలగొట్టి బ్యాటరీ చోరీ...



రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : రుద్రూర్ మండల కేంద్రంలోని అంగడి బజార్ వద్ద మహమ్మద్ ఫక్రుకు చెందిన ఆటో అద్దాలను అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి, బ్యాటరిని దొంగిలించారు. ఈ ఘటన పై ఆటో యజమాని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.



# పేకాట స్థావరాలపై పోలీసుల మెరుపు దాడులు...

- 14 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్...

- రూ. 16,630 నగదు స్వాధీనం..కేసు నమోదు..

రుద్రూర్, బతుకమ్మ : దీపావళి పండుగ సందర్భంగా రుద్రూర్ మండల కేంద్రంలోని రాణంపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు రుద్రూర్ ఇంచార్జ్ ఎస్సై ఎల్. రామ్ తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఏడుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.10,130 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు.



- అంబం (ఆర్) గ్రామంలో పేకాట స్థావారం పై పోలీసుల దాడి...

రుద్రూర్ మండలంలోని అంబం(ఆర్) గ్రామంలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించగా, పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.6,500 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఇంచార్జ్ ఎస్సై ఎల్. రామ్ తెలిపారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

# అనుమతి లేకుండా బోరుబావులు తవ్వడం నిషేధం

## తహసీల్దార్ కిరణ్



భీమ్ గల్, బతుకమ్మ ఎల్ నినో ప్రభావం కారణంగా జిల్లాలో ఆశించినంత వర్షం పడని కారణంగా జిల్లాలో భూగర్భజాల మట్టం రోజు రోజుకు తగ్గిపోతున్న కారణంగా అనుమతి లేకుండా బోర్ బావులు తవ్వడం నిషేదించినట్లు తహసీల్దార్ కిరణ్ తెలిపారు. ఈ నిషేధిత ఆదేశాలు ప్రభుత్వం జారీ చేసిన దరిమీల పొలాల వద్ద గాని, ఇండ్ల వద్దగాని, ఎక్కడైన బోర్ బావులను తవ్వితే కఠిన చర్యలు తప్పవున్నారు. ఈ ప్రభుత్వ నిబంధనల మేరకు మండల పరిధిలో సంబంధిత సమర్థ అధికారుల ముందస్తు అనుమతి లేకుండా బోర్లు వెయ్యవద్దన్నారు. ఈ ఆదేశాలను మండల ప్రజలందరూ పాటించాలని తహసీల్దార్ కోరారు.

# రోడ్డు ఇరుకుగా లేకుండా షెడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి..

- రోడ్డు కబ్జా చేశారని తహశీల్దార్‌కు అంబం గ్రామస్తులు వినతి...



రుద్రూర్, బతుకమ్మ : రుద్రూర్ గ్రామం నుండి అంబం (ఆర్) గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన వెంకటేశ్వర గుప్తా వారి రెవెన్యూ ల్యాండ్ లో వ్యాపార నిమిత్తం షెడ్డు ఏర్పాటు చేసుకోవడం కొరకు పనులు చేపడుతున్నారు. అంబం గ్రామానికి వెళ్లే రోడ్డును కబ్జా చేసి షెడ్డు వేస్తున్నారని, ఆ వ్యక్తికి మా గ్రామస్తులం వెళ్లి అడుగగా మీ అంబం రోడ్డు ఇక్కడ లేదు అని అతివాదంగా మాట్లాడడం జరిగిందని గ్రామ సర్పంచ్ కుర్రెపు గంగాధర్ పేర్కొన్నారు. ఈ విషయం పై శనివారం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామని, తహసిల్దార్ సురేందర్ నాయక్ కు వినతి పత్రాన్ని అందజేశామన్నారు. రోడ్డు ఇరుకుగా లేకుండా వారి ల్యాండ్ లో షెడ్ నిర్మాణం చేపట్టే విధంగా చూడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో గ్రామస్తులు ఉన్నారు.

# తప్పుడు ఆరోపణలు చేస్తే దేహశుద్ధి తప్పదు

### చిరుమల్ల రాకేష్ కాదు.. చిల్లర రాకేష్

### బల్బూర్ వెంకట్‌పై తప్పుడు ప్రచారం చేశారనే ఆరోపణతోనే బాలరాజు అరెస్టు

### ఎన్ ఎస్ యు ఐ జిల్లా మాజీ అధ్యక్షులు బండారి సునీల్ గౌడ్

పెద్దపల్లి ప్రతినిధి, బతుకమ్మ :యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు బల్బుర్ వెంకటపై మరోసారి తప్పుడు ఆరోపణలు చేస్తే దేహశుద్ధి తప్పదని కరీంనగర్ జిల్లా మాజీ ఎన్ ఎస్ యు ఐ ప్రెసిడెంట్ బండారి సునీల్ గౌడ్ హెచ్చరించారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్



లో శనివారం నిర్వహించిన ప్రెస్ మీట్లో ఆయన మాట్లాడారు. అసత్య ఆరోపణలు చేసిన బీఆర్ఎస్ నాయకుడు చిరుమల్ల రాకేష్ పై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చిరుమల్ల రాకేష్ కాదు.. చిల్లర రాకేష్ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బల్బూర్ వెంకట్‌కు సంబంధించిన ప్రీ వెడ్డింగ్ ఫొటోలను మార్ఫింగ్ చేసి, వాటిని తప్పుగా ప్రచారం చేసినందుకే దూదిమెట్ల బాలరాజు యాదవ్‌ను పోలీసులు చట్టప్రకారం అరెస్టు చేశారని తెలిపారు. ఈ వ్యవహారాన్ని రాజకీయం చేస్తూ చిరుమల్ల రాకేష్ మాట్లాడటం సరికాదన్నారు. రాజకీయంగా గుర్తింపు పొందేందుకే రాకేష్ ఇతర నాయకులపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. బల్బూర్ వెంకట్‌పై విమర్శలు చేసే ముందు తన రాజకీయ ప్రస్థానం, గతంలో చేసిన ఉద్యమాలు, విద్యార్హతల గురించి ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. అలాగే సాస్ కంపెనీని బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలపై రాకేష్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని పలు ఎమ్ఎన్సీ కంపెనీలను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నాయకత్వంపై ఆరోపణలు చేశారు. వ్యక్తిగత ఫొటోలతో రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. పెద్దపల్లి ఎంపీతో పాటు బల్బూర్ వెంకట్‌పై అనవసర విమర్శలు చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఇకనైనా వ్యక్తిగత ఆరోపణలు మానుకోవాలని, మరోసారి తమ నాయకుల జోలికి వస్తే తగిన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బండారి సునీల్ గౌడ్ హెచ్చరించారు.

# కార్మికుల హక్కుల సాధనే లక్ష్యంగా బీఎన్ఆర్‌కేఎస్ మహాసభలు

### -ఈ నెల 20న పెద్దపల్లిలో నాలుగో జిల్లా మహాసభలు.. -విజయవంతం చేయాలని నాయకుల పిలుపు

పెద్దపల్లి ప్రతినిధి, బతుకమ్మ :భవన నిర్మాణ రంగ కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం పోరాటాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ నెల 20న పెద్దపల్లిలో భవన నిర్మాణ రంగాల, కార్మిక సంఘం (బీఎన్ఆర్‌కేఎస్) నాలుగో జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు సంఘ నాయకులు తెలిపారు. పెద్దపల్లిలోని కూనారం రోడ్డులో ఉన్న ఆర్.కె. గార్డెన్‌లో 11:30 గంటలకు మహాసభలు ప్రారంభమవుతాయని వెల్లడించారు.మహాసభలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ భవనాలు, వంతెనల నిర్మాణంలో శ్రమిస్తున్న భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పాలకులు, రాజకీయ పార్టీలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమం కోసం వసూలు చేస్తున్న కోట్లాది రూపాయల సెస్ నిధులు అర్హులైన కార్మికులకు పూర్తిస్థాయిలో అందడం లేదని విమర్శించారు. అదేవిధంగా 1996 చట్టం కూడా సమర్థవంతంగా అమలు కావడం లేదని ఆరోపించారు.గత 23 ఏళ్లుగా భవన నిర్మాణ కార్మికుల హక్కుల సాధన కోసం తమ సంఘం నిరంతరం పోరాటాలు సాగిస్తోందని పేర్కొన్నారు. ఈ క్రమంలో నిర్వహిస్తున్న నాలుగో జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, మండలాల నుంచి భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కోర్ కమిటీ సభ్యుడు దర్శనాల రాజనర్సు, కోర్ కమిటీ సభ్యులు న్యాతరి శంకర్, ఒరేం చిరంజీవి, దేవి కొమురేష్ పాల్గొన్నారు.



# రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



హైదరాబాద్, బతుకమ్మ : దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని, సుఖసంతోషాలు, ఆయురా రోగ్యాలు, శాంతి,సౌభాగ్యాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దీపావళి పండుగ ప్రజలందరిలో నూతన ఉత్సాహాన్ని నింపాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరూ దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో, కుటుంబ సభ్యులు, ఆత్మీయులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని ఆయన కోరారు. సమాజంలో ప్రేమ, సోదరభావం, ఐక్యత మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ దీపావళి ప్రతి ఇంటా వెలుగులు నింపి, ప్రతి కుటుంబంలో ఆనందాన్ని తీసుకురావాలని మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు

# పేకాట ఆడినా ఆడించినా కఠిన చర్యలు తప్పవు

### దీపావళి పండుగ నేపథ్యంలో స్పెషల్ టీంలు పటిష్టమైన నిఘా ఏర్పాటు

### పోలీసు కమిషనర్ సాయిచైతన్య

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : దీపావళి పండుగ నేపథ్యంలో నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో పేకాటను పూర్తిగా నిషేధించినట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. పండుగ సమయంలో ఎవరైనా పేకాట ఆడినా, పేకాట స్థావరాలు నిర్వహించినా, ఇతరులను పేకాట ఆడేందుకు ప్రోత్సహించినా లేదా పేకాట నిర్వహణకు సహకరించినా వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు పేకాటపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ఎక్కడైనా పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందితే తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసారు. ప్రజలు కూడా తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా పేకాట ఆడుతున్నా, ఆడిస్తున్నా లేదా పేకాట నిర్వహణకు ప్రోత్సహిస్తున్నట్లు తెలిసినా వెంటనే నిజామాబాదు పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712659700కు సమాచారం అందించాలని సీపీ కోరారు. పండుగ నేపథ్యంలో స్పెషల్ టీం లు, పటిష్టమైన నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రజలు సహకరించాలని పండుగను ప్రశాంతంగాఆనందంగా జరుపు కోవాలన్నారు.

# జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల



హైదరాబాద్, బతుకమ్మ :దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లా, బాల్కొండ నియోజకవర్గ ప్రజలకు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి, చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఈ దీపావళి పండుగ ప్రతి ఇంటా ఆనందం, సంతోషం, సిరిసంపదలు, ఆయురారోగ్యాలు తీసుకురావాలని, ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో పండుగను జరుపుకోవాలని కోరారు.నిజామాబాద్ జిల్లా ప్రజలు, బాల్కొండ నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో, సౌభాగ్యాలతో వర్ధిల్లాలని, అందరి జీవితాల్లో దీపావళి వెలుగులు నిండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.